TGTEL/25/A0977

తొవ్వ స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 44 | బుధవారం 08-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

# నక్సల్స్ అడ్డాలో విదేశీయులు

**నంబి జలపాతాన్ని సందర్శించిన జర్మనీ పర్యాటకులు**

**ఆపరేషన్ కగార్‌తో మారుతున్న బస్తర్ ముఖ చిత్రం**

**చర్ల, అక్టోబరు 7:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతం బస్తర్ అడవుల పేరు వినగానే ఒకప్పుడు ప్రజలు భయపడేవారు. కానీ, 'ఆపరేషన్ కగార్'తో ఆ పరిస్థితి మారింది. కేంద్ర బలగాలు అడవుల్లో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టడంతో బస్తర్ ముఖచిత్రం కొత్తదనం సంతరించుకుంది. ఎత్తైన గుట్టలు, లోయలు, కనువిందు చేసే జలపాతాలతో నిండిన బస్తర్ అంటేనే అందాలకు నిలయం. గతంలో రోడ్డు సౌకర్యం లేక జిల్లా కేంద్రాలకే పరిమితమైన పర్యాటకులు, ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు కూడా తరలివస్తున్నారు. ఈ అభివృద్ధి నేపథ్యంలో, బీజాపూర్ జిల్లాలోని నంబి జలపాతాన్ని సందర్శించడానికి మంగళవారం ఇద్దరు జర్మనీ దేశస్థులు వచ్చారు.

# మణప్పురం మేనేజర్‌ని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**తొవ్వ ,ప్రతినిధి .అక్టోబర్ 07:**
మణప్పురం మేనేజర్ ని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్ చేసినట్టు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు టౌన్ పరిధిలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ వద్దకు నిందితుడైన బానోత్ కళ్యాణ్ అనే వ్యక్తి వచ్చి తన యొక్క బంగారం వేరే బ్యాంక్ లో తాకట్టులో ఉంది, అక్కడ అధిక వడ్డీ కడుతున్నాను, ఆ బంగారాన్ని విడిపించి మీ బ్యాంకుకు మార్టిగేజ్ చేసుకోవాలని అడిగినాడు, నిందితుని మాటలు నమ్మి బ్రాంచ్ మేనేజర్ మార్టిగేజ్ కు కావలసిన మొత్తం 6,22,000/- రూపాయలు నిందితుని అకౌంట్ కి ట్రాన్స్ఫర్ చేశారు. అట్టి డబ్బు ద్వారా నిందితుడు బంగారం విడిపించకుండా తన స్వంత అవసరాలకు వాడుకుని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ వారిని మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న గతంలో ఎఇఒ గా పని చేసి సస్పెండైన బానోత్ కళ్యాణ్ అనే నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించామని మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.



# హైకోర్టులో బలమైన వాదన వినిపిద్దాం

**మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 7:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో చట్టపరంగా చేయాల్సిందంతా పద్ధతి ప్రకారం చేశామని, దీనిపై హైకోర్టులో జరిగే విచారణలో బలమైన వాదనలు వినిపిద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. న్యాయస్థానాల సూచనలకు అనుగుణంగా కులగణన సర్వే నిర్వహించి.. ఎంపిరికల్ డాటా ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 న్యాయసమీక్షకు నిలుస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. హైకోర్టులో బుధవారం విచారణ జరుగుతున్న సందర్భంలో బీసీ మంత్రులంతా అక్కడే ఉండి పర్యవేక్షించాలని సూచించారు. జీవో 9ను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో భేటీ అయ్యారు.

# బీసీ సంక్షేమంపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

**వసతి గృహాల్లో కనీస వసతులు లేవు**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, అక్టోబరు 7:** బీసీల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేస్తున్నామంటూ ప్రభుత్వం పదే పదే గొప్పలు చెప్పుకుంటున్నా.. వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు, పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకులకు కనీసం కుల ధ్రువపత్రాలు కూడా ఇవ్వడంలేదని పేర్కొన్నారు. 'సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలు అస్తవ్యస్తంగా మారాయి. దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు గురుకులాల విద్యాలయాల్లో చదువుతున్నారు. కానీ వారికి తినడానికి సరైన భోజనం లేదు. సురక్షితమైన భవనాలు లేవు. ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, గురుకులాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో యజమానులు భవనాలకు తాళాలు వేస్తున్నారు' అని రాంచందర్‌రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల విద్యార్థుల కోసం గురుకులాల్లో అన్ని వసతులు కల్పించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# నేను మంత్రి కావడం మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా..?

**మంత్రులు అడ్లూరి, పొన్నం మధ్య వివాదం**

**త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజ్‌ను కలుస్తా.. : అడ్లూరి లక్ష్మణ్**

**వివాదాన్ని మరింత జటిలం చేయవద్దు : మహేశ్‌కుమార్ గౌడ్**

**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ప్రచారంపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పందించారు. తనపై చేసిన వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ స్పందించాలని డిమాండ్ చేశారు. తాను పక్కన ఉంటే మరో మంత్రి వివేక్ ఓర్చుకోవడం లేదని, లేచి వెళ్లి పోతున్నారని ఆరోపించారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు. త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజ్‌ను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ వెల్లడిరచారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అన్నారు. తాను మంత్రి కావడం మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని, పొన్నం మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనదే బాధ్యతని వెల్లడించారు. పొన్నం వ్యాఖ్యలపై ఖర్గే, మీనాక్షికి లేఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాశారు. పొన్నం ప్రభాకర్ తీరుపై ఫిర్యాదు చేశారు. త్వరలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గేను కలుస్తానన్న అడ్లూరి రేపటిలోగా పొన్నం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య తలెత్తిన వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరగడం పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి స్పందించడంతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జోక్యం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ ఉదయం ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడి వివాదాన్ని మరింత జటిలం చేయవద్దని సూచించినట్లు సమాచారం. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని ఒకరికొరు సహకరించుకోవాలని చెప్పినట్లుగా పీసీసీ వర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడిగా జోక్యం చేసుకోవడంతో ఇద్దరు మంత్రుల మధ్య చోటు చేసుకున్న వివాదానికి తెరపడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# తీన్మార్ మల్లన్నకు హైకోర్టులో ఊరట...

**ఇటీవలే తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించిన మల్లన్న**

**స్థానిక ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలని వినతి**

**మల్లన్న అభ్యర్ధనను పరిశీలించాలని ఈసీకి హైకోర్టు ఆదేశం**




**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన పార్టీ గుర్తింపు, గుర్తుకు సంబంధించిన అభ్యర్థనను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న మల్లన్నకు ఊరట లభించినట్లయింది. ఇటీవల తాను స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గుర్తింపునిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గుర్తును కేటాయించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. తెలంగాణలో బీసీలకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎరుపు, ఆకుపచ్చ రంగుల జెండా మధ్యలో పిడికిలి, కార్మిక చక్రం, వరి కంకులతో పార్టీ పతాకాన్ని రూపొందించారు. 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాలను జెండాపై ముద్రించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో పార్టీ గుర్తింపు, గుర్తు కేటాయింపునకు గల అవకాశాలను ఎన్నికల సంఘం పరిశీలించనుంది.

# దుర్భేద్యంగా సుప్రీంకోర్టు!

**700 మంది భద్రతా సిబ్బంది**

**సీజేఐకి జడ్ ప్లస్ కేటగిరీ భద్రత అయినా.. సీజేఐపై దాడి యత్నం**



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** దేశ సర్వోన్నత న్యాయస్థానం.. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పైకి సోమవారం ఓ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేయడం.. భద్రతా సిబ్బంది హుటాహుటిన స్పందించి నిలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు భద్రత, సీజేఐ సహా న్యాయమూర్తులకు కల్పిస్తున్న భద్రత వంటివి చర్చకు వచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు సుప్రీంకోర్టు.. అత్యంత దుర్భేద్యమని వెల్లడించారు. 700 మంది భద్రతా సిబ్బంది నిరంతరం కంటికి రెప్పలా కాపాడుతున్నారని తెలిపారు. ప్రతి కోర్టురూమ్‌కు ప్రత్యేకంగా సాయుధ గార్డు ఉంటారని, ముఖ్యంగా జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న సీజేఐకి మరింత అదనపు భద్రత ఉంటుందని వివరించారు. ఢిల్లీ పోలీసులు సహా కేంద్ర భద్రతా ఏజెన్సీలకు చెందిన గార్డులు సుప్రీంకోర్టు ఆవరణలో భద్రతా విధులు నిర్వహిస్తారని తెలిపారు. న్యాయమూర్తులు, సిబ్బంది, అధికారులు సహా అందరి భద్రతను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కాగా, సీజేఐపై బూటు విసరబోయిన న్యాయవాది రాకేశ్ కిశోర్ సుప్రీంకోర్టు లాయర్ కాదని, ఓ సీనియర్ అడ్వొకేట్ సాయంతో తాత్కాలిక పాస్‌ను సంపాయించుకుని కోర్టులోకి ప్రవేశించారని అధికారులు తెలిపారు.

# జూబ్లీహిల్స్ రేసులో లేను

**బొంతు రామ్మోహన్**

**అధిష్ఠానం పరిశీలనలో బొంతు రామ్మోహన్ పేరు!**

**అయితే, తాను టికెట్ కోసం ఎవరినీ అడగలేదన్న బొంతు**

**ఎవరిని బరిలో దింపినా సపోర్ట్ చేస్తానని వెల్లడి**



**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ అధికార కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగానే, టికెట్ ఆశిస్తున్న ఇద్దరు కీలక నేతలకు సంబంధించిన వార్తలు పార్టీలో కలకలం రేపుతున్నాయి. బరిలో ఉంటారని భావించిన ముఖ్య నేతల్లో ఒకరు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించగా, మరొకరు క్రిమినల్ కేసులో చిక్కుకున్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్న వారిలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్. అయితే, తాను అభ్యర్థిత్వ రేసులో లేనని ఆయన స్పష్టం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను టికెట్ కోసం ఎవరినీ అడగలేదని, పార్టీ అధిష్టానం ఎవరిని బరిలోకి దింపినా వారి గెలుపు కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తానని ఆయన తెలిపారు. పార్టీ సిఫారసు చేసిన జాబితాలో ఆయన పేరు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకవైపు బొంతు రామ్మోహన్ ఇలా ప్రకటించగా, మరోవైపు టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 4న యూసుఫ్‌గూడలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటరు కార్డులను పంపిణీ చేశారన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు సోమవారం నవీన్ యాదవ్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేశారు.దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి సునీతను ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ నుంచి బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్‌లతో పాటు సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, కాంగ్రెస్ అధిష్టానం జూబ్లీహిల్స్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 11న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు జరగనున్న ఈ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది.

# వారి వివరాలు ఇవ్వండి

**బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది పేర్లను రేపట్లోగా ఇవ్వండి**

**చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా.. కొత్తవా?**

**ఆ వివరాలు వెల్లడించి గందరగోళం తొలగించండి**

**ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశం**



న్యూఢిల్లీ, అక్టోబరు 7: బిహార్ తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను గురువారంలోగా ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ... అందులో చేర్చిన పేర్లు గతంలో తొలగించినవా లేక కొత్త ఓటర్లవా అని ప్రశ్నించింది. ఈ విషయంలో గందరగోళం నెలకొందని, దాన్ని తొలగించాలంటే కొత్తగా చేర్చిన పేర్లను వెల్లడించాలని కూడా స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం మంగళవారం విచారణను కొనసాగించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ముఖ్యమని, ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను కూడా సంబంధిత కార్యాలయాల్లో ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. కాగా, తుది జాబితాలో చేర్చిన పేర్లు చాలావరకు కొత్త ఓటర్లవేనని ఈసీ తరఫున న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు. తొలగించిన ఓటర్ల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఆగస్టు 1న బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ఎస్ఐఆర్ అనంతరం వివిధ కారణాలతో 65 లక్షల పేర్లను తొలగించామని, రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.24 కోట్లుగా పేర్కొంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 7.89 కోట్లుగా ఉంది. ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తొలగించిన ఓటర్ల వివరాలను వెల్లడించాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ సెప్టెంబరు 30న తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 21.53 లక్షల పేర్లను చేర్చగా.. 3.66 లక్షల పేర్లను తొలగించింది. దాంతో ముసాయిదా జాబితాలో కంటే ఓటర్ల సంఖ్య 17.87 లక్షలు పెరిగి.. 7.42 కోట్లకు చేరింది.

# నల్గొండలో మైనర్ విద్యార్థినిపై హత్యాచారం

**పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు**



**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
నల్గొండ పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. నల్గొండలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అత్యాచారం, హత్యకు గురైంది. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ఓ ఇంట్లో యువతి మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఉదయం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న నల్గొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపి, చనిపోయిన యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తె మృతదేహాన్ని చూసి బోరుమన్నారు. ఈ కేసులో ముందుగా అనుమానాస్పద మృతిగా భావించినా తరువాత అత్యాచారం చేసి హత్య చేసినట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. నిందితుడు గడ్డం కృష్ణ కోసం గాలిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితుని సెల్‌ఫోన్ డేటా ఆధారంగా పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గడ్డం కృష్ణ(22) గా పోలీసులు భావిస్తున్నారు. ఉదయం ఆమెను తన స్నేహితుడి గదికి తీసుకెళ్లి హత్యాచారం చేసినట్లు తెలిపారు. నిందితుడు గడ్డం కృష్ణపై వన్ టౌన్ పీఎస్‌లో రేప్, పోక్సో కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. ఘటనలో ఇంకా ఎవరెవరున్నారు అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి దోషులకు త్వరగా శిక్షపడే విధంగా కృషి చేస్తామని అన్నారు. కాగా నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గడ్డం కృష్ణతో పాటు సహకరించిన అతని స్నేహితుడిపై కూడా పోలీసులు కేసు నమోదుచేశారు.

# పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై బాంబు దాడి

**సింధ్ ప్రావిన్స్‌లో రైల్వే ట్రాక్‌పై పేలుడు, ఏడుగురికి గాయాలు**

**క్వెట్టా వెళుతుండగా షికార్‌పూర్ జిల్లాలో ఘటన**

**బాధితులను ఆసుపత్రులకు తరలించిన అధికారులు**

తొవ్వ ,డెస్క్ :
పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని షికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, షికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళు తున్నప్పుడు ఈ పేలుడు సంభవించినట్లు షికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్





షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని షికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. ఆ ఘటనలో రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. అంతకుముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఉగ్రవాదులు ఇదే రైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది. తాజా ఘటనతో ప్రయాణికుల్లో మరోసారి ఆందోళన నెలకొంది.

# ఉత్తర బెంగాల్‌లో బీజేపీ నేతలపై దాడి

- **రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ**
- **విపత్తును రాజకీయం చేస్తున్నారంటూ సీఎం మమతా బెనర్జీ ఫైర్**
- **భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో 30 మందికి పైగా మృతి**
- **బాధితులకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన మమతా సర్కార్**





తొవ్వ ,డెస్క్ :
పశ్చిమ బెంగాల్‌లో ప్రకృతి విపత్తు రాజకీయ రంగు పులుముకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఇద్దరు బీజేపీ నేతలపై దాడి జరగడంతో, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం మొదల్కెంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించగా, విపత్తును అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా బదులిచ్చారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు ఉత్తర బెంగాల్‌ను అతలాకుతలం చేస్తున్నాయి.

ఈ ఘటనల్లో ఇప్పటివరకు 30 మందికి పైగా మరణించగా, పలువురు గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జల్‌పాయ్‌గురి జిల్లాలోని నాగర్‌కాటాలో సహాయక చర్యలను పర్యవేక్షించేం దుకు వెళ్లిన బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము, సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌లపై స్థానికులు దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీ ముర్ము ముఖం, ముక్కు నుంచి రక్తం కారుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారని బీజేపీ ఆరోపించగా, ప్రతిపక్షాలు చేస్తున్న "ఫొటో-ఆప్ రాజకీయాల" వల్లే ప్రజాగ్రహం వ్యక్తమైందని టీఎంసీ కొట్టిపారేసింది. ఈ దాడి ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. "వరద బాధితులకు సేవ చేస్తున్న మా పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేపై జరిగిన దాడి దిగ్భ్రాంతికరం. ఇది ఇతరుల భావాలను పట్టించుకోలేని టీఎంసీ తత్వాన్ని, రాష్ట్రంలో దారుణంగా ఉన్న శాంతిభద్రతల పరిస్థితిని తెలియజేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధాని విమర్శలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అంతే ఘాటుగా బదులిచ్చారు. "విపత్తు సమయంలో ప్రజలు కష్టాల్లో ఉంటే, ప్రధాని ఎలాంటి విచారణ లేకుండా ఈ ఘటనను రాజకీయం చేయడం దురదృష్టకరం. ఎలాంటి ఆధారాలు, విచారణ నివేదికలు లేకుండానే టీఎంసీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని ఆమె 'ఎక్స్'లో స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, రాజకీయ వేదికల నుంచి చేసే ట్వీట్లతో నేర నిర్ధారణ జరగదని ఆమె హితవు పలికారు. ఈ ఘటనపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరించాలని సూచించారు. మరోవైపు, ఈ విపత్తు కారణంగా డార్జిలింగ్, మీరిక్ వంటి ప్రాంతాల్లో అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. బాధితుల కుటుంబాలకు రూ. 5 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు.

# నేనేమీ భయపడడం లేదు, జరిగిన దానికి చింతించడం లేదు

## - లాయర్ రాకేశ్ కిషోర్





తొవ్వ ,డెస్క్ :
న్యూఢల్లీ: సీజేఐ గవాయ్‌పై షూ విసిరేయబోయే ఘటన పట్ల తానేమీ పశ్చాతాపం పడడం లేదని అడ్వకేట్ రాకేశ్ కిషోర్ అన్నారు. గవాయ్‌పై షూ విసిరేయబోయిన ఘటన గురించి మీడియాతో ఆ లాయర్ మాట్లాడారు. ఆ ఘటన పట్ల తానేమీ నిరాశ చెందడంలేదన్నారు. నేనేమీ భయడడం లేదని, జరిగిన దానికి చింతించడం లేదని అన్నారు. సెప్టెంబర్ 16వ తేదీన కోర్టులో ఓ పిల్ వేశామని, ఆ కేసులో సీజేఐ తీర్పునిస్తూ.. దేవుడి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకోవాలన్నారని, సనాతన ధర్మం అంశంపై కేసులు వస్తే, సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేస్తోందని ఆయన ఆరోపించారు. పిటీషన్‌దారుడికి రిలీఫ్ ఇవ్వలేకపోయినా పర్వాలేదు, కానీ ఆ పిటీషనర్‌పై వెటకారం సరికాదు అని లాయర్ రాకేశ్ తెలిపారు. ఆ కేసులో సీజేఐ వ్యాఖ్యల పట్ల బాధపడ్డానని, కానీ తానేమీ తాగి షూ విసిరే ప్రయత్నం చేయలేదన్నారు. ఆ వ్యాఖ్యలకు ఇది నా కౌంటర్ అని అన్నారు. నా పేరు డాక్టర్ రాకేశ్ కిషోర్. ఎవరైనా నా కులం ఏంటో చెప్పగలరా? నేను కూడా దళితుడినే కావొచ్చు. సీజేఐ దళితుడన్న కోణంలో మీరు ఆలోచిస్తున్నారేమో.. కానీ ఆయన దళితుడు కాదు.. ఆయన తొలుత సనాతన హిందువు అని, కానీ ఆయన తన మతవిశ్వాసాన్ని వీడి, బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు. ఒకవేళ హిందూ మతాన్ని వదిలేసి.. బౌద్ధాన్ని స్వీకరిస్తే, అప్పుడు ఆయన ఎలా దళితుడు అవుతాడని లాయర్ రాకేశ్ ప్రశ్నించారు. ఇదంతా మైండ్‌సెట్‌కు సంబంధించిన అంశమని ఆయన అన్నారు. తానేమీ క్షమాపణలు కోరబోనన్నారు. అలాగే చింతించే అంశం కూడా కాదన్నారు. సున్నిత అంశాలను పరిగణలోకి తీసుకుని జడ్జీలు పనిచేయాలన్నారు. లక్షల సంఖ్యలో కేసులు పెండిరగ్‌లో ఉన్నాయని, తానేమీ చేయలేదని, మీరు నన్ను ప్రశ్నిస్తున్నారని, అందుకే దేవుడే నాతో ఈ పని చేయించారని లాయర్ కిషోర్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న ఓ గుడిలోని విష్ణువు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన పిల్‌పై సీజేఐ స్పందిస్తూ కొన్నివ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను తప్పుపడుతూ లాయర్ రాకేశ్ సోమవారం సీజేఐపై దాడికి ప్రయత్నించారు. గవాయ్‌పై షూ విసరబోయిన లాయర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 71 ఏళ్ల లాయర్ మయూర్ విహార్‌లో ఉంటున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో ఆయన రిజిస్టర్ సభ్యుడు.

# మృతుల కుటుంబాలకు విజయ్ వీడియో కాల్

- **త్వరలో వారిని ప్రత్యక్షంగా కలుస్తానని హామీ**
- **బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని చెప్పిన టీవీకే చీఫ్**



తొవ్వ ,డెస్క్ :
తమిళనాడులోని కరూర్ లో టీవీకే చీఫ్ విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. గత నెల 27న జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా మరో 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన విజయ్.. దుర్ఘటన వెనక కుట్ర కోణం ఉందని ఆరోపించారు. స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని టీవీకే తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలను విజయ్ పరామర్శించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలోనే విజయ్ తాజాగా స్పందించారు. మృతుల కుటుంబాలతో ఆయన వీడియో కాల్ లో మాట్లాడారు. ఈరోజు ఉదయం బాధిత కుటుంబాలకు విజయ్ ఫోన్ చేశారు. ఆత్మీయులను కోల్పోయి దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చారు. త్వరలోనే వచ్చి వారిని కలుస్తానని హామీ ఇచ్చారు. పార్టీ తరఫున, వ్యక్తిగతంగా కూడా వారికి అండగా ఉంటానని విజయ్ పేర్కొన్నారు. తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని త్వరలోనే పరామర్శిస్తానని విజయ్ చెప్పారు. కాగా, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ టీవీకే పార్టీ తరఫున విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.

# పాక్ ఆర్మీ పదే పదే తప్పుడు ప్రచారం

- **భారత్ తో ఘర్షణలో చైనా ఆయుధాలు అద్భుతంగా పనిచేశాయన్న ఐఎస్‌పీఆర్ డ్కెరెక్టర్ జనరల్**
- **భారత యుద్ధ విమానాలు ఏడింటిని కూల్చేశామని ప్రగల్భాలు**
- **చైనా తయారీ జేఎఫ్-17 సహా 12 పాక్ విమానాలను కూల్చేశామని భారత వాయుసేనాధిపతి**



తొవ్వ ,డెస్క్ :
భారత ఆర్మీ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' లో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ ఇప్పటికీ ప్రగల్భాలు పలకడం మానుకోలేదు. సొంత పౌరుల ముందు పరువు కోసం పాక్ ఆర్మీ పాకులాడుతోంది. ఆపరేషన్ సిందూర్ లో భారత వాయుసేన నిప్పుల వర్షం కురిపించగా.. పాక్ కు చెందిన యుద్ధ విమానాలు కాలి బూడిదయ్యాయి. ఈ యుద్ధ విమానాలను చ్కెనా నుంచి పాక్ కొనుగోలు చేసింది. ఈ విషయం బయటపడితే పౌరుల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందనే భయంతో పాక్ ఆర్మీ ప్రగల్భాలు పలుకుతోంది. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాక్ ఐఎస్‌పీఆర్ డ్కెరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ మరో కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చారు. భారత్‌తో జరిగిన ఘర్షణలో తాము ఉపయోగించిన చ్కెనా ఆయుధాలు బాగా పనిచేశాయని చెప్పారు. భారత యుద్ధ విమానాలు ఏడిరటిని కూల్చేశామంటూ తప్పుడు ప్రకటనలు చేశారు. ఈ ఘర్షణలో పాక్ ఒక్క యుద్ధ విమానాన్ని కూడా కోల్పోలేదని, చ్కెనా యుద్ధ విమానాలు సమర్థంగా దాడులు చేశాయని చెప్పారు. భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ ఇటీవల ఓ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. భారత యుద్ధ విమానాలను కూల్చేశామంటూ పాక్ చేస్తున్న వాదనలు కట్టుకథలుగా కొట్టిపారేశారు. చ్కెనా నుంచి పాకిస్థాన్ కొనుగోలు చేసిన జేఎఫ్-17 యుద్ధ విమానాలు మన ఫైటర్ జెట్ల ముందు నిలవలేకపోయాయని చెప్పారు. పాక్ సైన్యం ఉపయోగించిన అమెరికా తయారీ ఎఫ్-16 యుద్ధ విమానాన్నీ కూల్చే శామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో 12 పాక్ యుద్ధ విమానాలను నేల కూల్చామని వివరించారు.

# ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవ..

## - అనుభూతులు పంచుకున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, తొవ్వ ,డెస్క్ :**



ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తన పరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆ నాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు.చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సీఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీ భూకంపం, సూపర్ సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లో పెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. తన ట్వీట్స్‌లో వివిధ అనుభవాలను గుర్తు చేశారు.

# శబరిమల అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్

**- ఐదు రోజుల పాటు టెంపుల్ ఓపెన్ - గోల్డ్ వివాదంపై సిట్?**

**- బంగారు పూత వివాదంపై సిట్ దర్యాప్తునకు ఆదేశించిన హైకోర్టు**




తొవ్వ ,డెస్క్ :

శబరిమల అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్. కేరళ పతనంతిట్ట జిల్లాలోని శబరిమల అయ్యప్ప ఆలయాన్ని తులం మాస పూజల కోసం అక్టోబర్ 17–22 వరకు తెరవనున్నారు. అక్టోబరు 17న సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్లు ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఉదయాస్తమాన పూజ, పడిపూజ, కలశాభిషేకం, పుష్పాభిషేకం వంటి ఐదు రోజుల ప్రత్యేక ఆచారాల తర్వాత అక్టోబర్ 22న రాత్రి 10 గంటలకు మూసివేస్తామని తెలిపింది. ఈ మేరకు ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, శబరిమల గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలకు బంగారు పూతపూసిన రాగి తాపడాలను ఆలయం తెరిచిన వెంటనే అంటే అక్టోబర్ 17న ఏర్పాటు చేస్తామని ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు స్పష్టం చేసింది. కేరళ హైకోర్టు, ఆలయ ప్రధాన పూజారి నుంచి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారం తాపడం బరువు తగ్గడంపై జరుగుతున్న వివాదంపై కేరళ దేవస్వమ్ మంత్రి కె. రాధాకృష్ణన్ స్పందించారు. శబరిమల వద్ద అన్ని కార్యకలాపాలు పూర్తి పారదర్శకతతో జరుగుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై హైకోర్టు పూర్తి విచారణకు ఆదేశించిందని, నివేదికను అందిన తర్వాత నిందితులపై తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. శబరిమల అయ్యప్పను దర్శించుకోవాలనుకునే భక్తులు తప్పనిసరిగా వర్చువల్ క్యూ విధానంలో దర్శన టికెట్లు పొందొచ్చు. తులం మాస దర్శనం కోసం బుకింగ్‌లు సోమవారం సాయంత్రం 5 గంటలకు అధికారిక వెబ్ సైట్ ద్వారా ప్రారంభమయ్యాయి. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు ఆన్‌లైన్ బుకింగ్ నుంచి మినహాయింపును ఇచ్చారు. ప్రస్తుతం వర్చువల్ క్యూ వ్యవస్థను నిర్వహిస్తున్న కేరళ పోలీసులు భక్తుల భద్రత గురించి చర్యలు తీసుకుంటున్నారు. సజావుగా తీర్థయాత్ర అనుభవాన్ని పొందడానికి భక్తుల సహకారం కూడా తమకు అవసరమని తేల్చిచెప్పారు. రోజువారీ యాత్రికుల సంఖ్యను పరిమితం చేసే వర్చువల్ క్యూ వ్యవస్థను, అంచనా వేసిన రద్దీని నిర్వహించడానికి అమలు చేస్తున్నారు.

# జనావాసాల్లోకి ఏనుగులు

**- రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం**



**తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:**

పటిష్ఠమైన చర్యల్లేవు, సుదీర్ఘ లక్ష్యాలూ లేవు. కంటి తుడుపు చర్యలతో మా అగచాట్లు తొలుగుతాయా? అడవి ఏనుగుల విధ్వంసాన్ని ఆపుతాయా? అన్న భావన తిరుపతి, చిత్తూరు జిల్లాల రైతుల ఆవేదన ప్రభుత్వాలకు పట్టడం లేదు. సదుం, పలమనేరు, పులిచెర్ల, పుంగనూరు, రామకుప్పం, గుడుపల్లె, వి.కోట ప్రాంతాల్లో ఏనుగుల బెడద ఎక్కువగా ఉంది. దాని కారణంగా మామిడి చెట్లు, టమోటా, ఆకు–కూరలు, వరి పంటలను నష్టపోతున్నారు.చిత్తూరు జిల్లా కోటూరులో రైతు రామకృష్ణ ఏనుగుల దాడిలో మరణించారు. పలమనేరు సమీపంలోని ఏనుగును అడవిలోకి పంపిస్తున్న అటవీ అధికారి సుకుమార్ గాయపడ్డారు. ఏనుగును ఎదుర్కోవడమనేది ప్రమాదకరం. నేరుగా ఎదురుపడే ప్రయత్నం అసలు చేయొద్దు. పిల్లలు, వృద్ధులు ఉంటే వెంటనే వారిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లండి. తెల్లటి దుస్తులు ధరించవద్దు. ఆహారం, నీటి కోసం ఏనుగులు వచ్చే మార్గాలు గమనించిన తర్వాత పొలానికి వెళ్లకపోవడమే మంచిది. తిరుపతి, చిత్తూరు అడవుల్లో అడవి ఏనుగుల సంఖ్య అధికంగా ఉంది. పూర్తి స్థాయిలో నష్టం జరిగిన తర్వాత ప్రభుత్వం స్పందించడాన్ని కంటితుడుపు చర్యగా రైతులు భావిస్తున్నారు. అటవీ శాఖ అవగాహన కార్యక్రమాలు సైతం పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదు. తిరుపతి, చిత్తూరు అటవీ ప్రభావిత ప్రాంతాల్లో ఏనుగుల గుంపులు పెద్ద ఎత్తున పంటల విధ్వంసంతో పాటు ప్రాణ, ఆస్తినష్టం కలిగిస్తున్నాయి. ఫలితంగా జరుగుతున్న నష్టం, వాటి దాడులతో రైతులు ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. ఈ ఘటనలు ఎక్కువవుతునే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటికి చెక్ పెట్టేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుంకీ ఏనుగులను ఒప్పందంపై కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

# వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి షాక్

**తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:**



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసింది. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై ఇవాళ(మంగళవారం) విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# అప్పు చేసి మరీ 3లక్షల బైక్ కొనిస్తే.. రెండు రోజులకే యాక్సిడెంట్‌లో మృతి!



తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:

కొత్త బైక్ కొనివ్వకపోతే కొడుకు ఏ అఘాయిత్యానికి పాల్పడతాడోనని భయపడి కొత్త బైక్ కొనిస్తే.. ఆ తల్లిదండ్రులకు కడుపు కోతనే మిగిల్చాడు. అలిగి.. మొండిపట్టు పట్టడంతో మూడు లక్షలు అప్పు చేసి మరీ తండ్రి బైక్ కొనిస్తే.. మితిమీరిన వేగంతో బైక్ నడిపి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. ఏపీలో ని విశాఖపట్నంలో ఈ విషాద ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం మహారాణిపేటలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని కుమారుడు హరీశ్ (19) ఇంటర్ వరకు చదివాడు. ప్రస్తుతం ఖాళీగా ఇంటి దగ్గరే ఉంటున్న హరీశ్.. కొద్దిరోజుల నుంచి బైక్ కొనివ్వాలని అడుగుతున్నాడు. బైక్ కొనేంత స్థోమత లేదని తండ్రి చెప్పినప్పటికీ హరీశ్ వినిపించుకోలేదు. తల్లిదండ్రుల మీద అలిగి.. మొండిపట్టు పట్టాడు. దీంతో చేసేదేమీ లేక.. మూడు లక్షల రూపాయలు అప్పు చేసి మరీ దసరా రోజున శ్రీనివాసరావు బైక్ కొని చ్చాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో టిఫిన్ చేయడానికి తన స్నేహితుడు వినయ్‌తో కలిసి హరీశ్ కొత్త బైక్‌పై ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు వెళ్లాడు. టిఫిన్ తిన్నాక వినయ్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకు బయల్దే రాడు. ఈ క్రమంలో హరీశ్ మితిమీరిన వేగంతో బైక్‌ను నడపడంతో సిరిపురం దత్ ఐలాండ్ టర్నింగ్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో హరీశ్‌కు తీవ్ర గాయా లు కావడంతో 108 అంబులెన్స్‌లో కేజీహె చ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమిం చడంతో సోమవారం ఉదయం హరీశ్ ప్రాణా లు కోల్పోయాడు. ఇక బైక్ వెనుకాల కూర్చు న్న వినయ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

# బొత్స సత్యనారాయణ కుటుంబానికి తప్పిన ప్రమాదం



**తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:**

వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబానికి పెను ప్రమాదం తప్పింది. విజయనగరంలో సిరిమానోత్సవం చూస్తుండగా వేదిక కూలింది. ఆ సమయంలో బొత్స కుటుంబం వేదికపైనే ఉంది. అయితే ఎటువంటి గాయాలు కాకుండా బొత్స ఫ్యామిలీ సురక్షితంగా బయటపడిరది. కానీ ఈ ప్రమాదంలో ఎస్సై, మరో చిన్నారి గాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం కన్నుల పండువగా సాగుతోంది. పూజారి వెంకటరావు సిరిమాను అధిరోహించారు. చదరగుడి నుంచి విజయ నగరం కోట వరకు సిరిమానును ఉరేగి స్తున్నారు. ఈ సిరిమానోత్సవం తిలకించేందుకు సతీసమేతంగా బొత్స సత్యనారాయణ వచ్చారు. ఈ క్రమంలోనే వేదికపై కూర్చుని ఉండగా అది కూలింది.

# హైవేపై కూలిన మెడికల్ హెలికాప్టర్

**- హైవే 50పై ఓ కారు మీద తలకిందులుగా పడ్డ వైనం**

**- ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు**

**- ఘటనతో హైవేపై పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు**

**- ప్రమాద కారణాలపై అధికారుల దర్యాప్తు ప్రారంభం**



తొవ్వ ,డెస్క్ :

అమెరికాలో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోగులను అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించే ఓ మెడికల్ హెలికాప్టర్ (ఎయిర్ అంబులెన్స్) రద్దీగా ఉండే హైవేపై కుప్పకూలింది. ఈస్ట్ శాక్రమెంటోలోని హైవే 50పై ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్ నేరుగా ఓ వాహనంపై తలకిందులుగా పడిపోవడంతో, ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు శాక్రమెంటో అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 'రీచ్ ఎయిర్ మెడికల్ సర్వీసెస్'కు చెందిన ఎయిర్‌బస్ హెచ్–130 హెలికాప్టర్ యూసీ డేవిస్ మెడికల్ సెంటర్ పైనుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంతో హైవే 50పై తూర్పు వైపు వెళ్లే మార్గాన్ని పూర్తిగా మూసివేసి, ట్రాఫిక్‌ను మళ్లించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన చిత్రాల్లో ఎరుపు రంగు హెలికాప్టర్ హైవే మధ్యలో కారుపై తలకిందులుగా పడి ఉన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో హెలికాప్టర్ ఆసుపత్రికి వెళుతోందా? లేక రోగిని తీసుకుని వస్తోందా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, అధికారులు దర్యాప్తు ప్రారంభించారని సంబంధిత వర్గాలు వెల్లడిరచాయి.

# కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్



**న్యూఢిల్లీ, తొవ్వ ,డెస్క్ :**

టీవీకే చీఫ్, నటుడు విజయ్ కరూర్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట అంశం సుప్రీంకోర్టుకు చేరింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖల్కెన పిటిషన్‌ను కొట్టివేయాలని మద్రాస్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. ఈ పిటిషన్ విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం అంగీకరిం చింది. ఈ మేరకు అక్టోబర్ 10వ తేదీన సుప్రీంకోర్టులో కేసు విచారణ జరగనున్నట్లు సమాచారం. టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. సభలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించారు. అయితే విజయ్ ర్యాలీలో తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తు కోరుతూ భారతీయ జనతా పార్టీ నేత ఉమా ఆనందన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఉమా ఆనందన్ వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో మంద్రాస్ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది.

# తిరుపతి నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ ఢిల్లీలో పట్టుకున్న పోలీసులు!



**తొవ్వ ,డెస్క్ :**

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుండి అక్రమంగా తరలిస్తున్నట్లు 10 టన్నుల ఎర్రచందనం దుంగలను ఢల్లీ పోలీసులకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. ఇద్దరు అనుమానిత స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు మంగళవారం ఒక అధికారి తెలిపారు. సౌత్‌ఈస్ట్ ఢల్లీకి చెందిన ఎస్‌టిఎఫ్ బృందం ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట చేసింది. తదుపరి దర్యాప్తు జరుగుతోంది అని ఢల్లీ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. రికవరీపై ఢల్లీ పోలీసు ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు విలేకరుల సమావేశం జరగనుంది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఈనెల 9న అనకాపల్లి జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన

**- కేవలం హెలికాప్టర్‌లో మాత్రమే పర్యటనకు రావాలని స్పష్టం**

**- తమిళనాడులో తొక్కిసలాట ఘటనను ప్రస్తావించిన అధికారులు**



**తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:**
వైసీపీ అధినేత జగన్ అనకాపల్లి జిల్లా పర్యటనకు సంబంధించి పోలీసులు కీలక సూచనలు చేశారు. ప్రజాభద్రత, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆయన రోడ్డు మార్గంలో ప్రయాణించేందుకు అనుమతి నిరాకరించారు. కేవలం హెలికాప్టర్‌లో మాత్రమే పర్యటనకు రావాలని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, జగన్ ఈ నెల 9వ తేదీన అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెంలో పర్యటించాల్సి ఉంది. ఈ పర్యటన కోసం విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మాకవరపాలెం వరకు సుమారు 63 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గంలో ప్రయాణించేందుకు వైసీపీ నేతలు పోలీసుల అనుమతి కోరారు. అయితే ఈ దరఖాస్తును జిల్లా పోలీసులు తిరస్కరించారు. ఈ విషయంపై అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ కుమార్ మీడియాకు వివరణ ఇచ్చారు. జగన్ రోడ్డు ప్రయాణ మార్గంలోని ప్రధాన కూడళ్ల వద్ద భారీగా జనసమీకరణ చేసి, ప్రదర్శనలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ నిర్వహించిన సభలో తొక్కిసలాట జరిగిందని, అలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసే బాధ్యత తమపై ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కారణాల వల్లే రోడ్డు మార్గంలో ప్రయాణానికి అనుమతి ఇవ్వలేదని, అందుకు ప్రత్యామ్నాయంగా హెలికాప్టర్‌లో మాకవరపాలెం చేరుకోవాలని సూచించినట్లు ఆయన వెల్లడిరచారు. ఈ మేరకు జగన్ హెలికాప్టర్ పర్యటనకు అవసరమైన అనుమతులు మంజూరు చేసినట్లు తుహిన్ కుమార్ స్పష్టం చేశారు.

# ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

**- ప్రియుడు మృతి - చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న పియురాలు**



**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
స్టేషన్ ఘనపూర్ జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం తాడికొండ గ్రామంలో ప్రేమజంట సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా ప్రియుడు మృతి చెందాడు. ప్రియురాలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, మండలంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అంజయ్య, రేణుకులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు మానసిక వికలాంగుడు. పెద్ద కుమారుడు అన్వేష్(26), కూతురు పెళ్లి చేశారు. నిరుపేద చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఈ కుటుంబం కూళి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. కాగా హనుమకొండ జిల్లా, ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన గడ్డం దాసు, ఎలిషా దంపతులకు ఒక కుమారుడు కాగా, కూతురు లేకపోవడంతో పావని అనే అమ్మాయిని చిన్నప్పటినుండే సాదుకున్నారు. పావని తండ్రి దాసు సంవత్సరం క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అన్వేష్ కు, పావని కి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇరువురు పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకుని అమ్మాయిని గత మూడు నెలల క్రితమే అబ్బాయి తన ఇంటికి తీసుకువచ్చాడు. అప్పటినుండి అందరూ అదే ఇంటిలో కలిసి ఉంటున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు సైతం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో పెళ్లి ఖర్చులు భరించి పెళ్లి చేయడానికి ఇరువురి కుటుంబాలు గత రెండు నెలల రోజుల క్రితమే అంగీకరించాయి. ఈలోగా అబ్బాయి అక్క కొడుకు మృతి చెందడంతో వీరికి చుట్టు రావడం, తర్వాత వినాయక చవితి పండుగ రావడం అటు తరువాత అబ్బాయి బంధువులు చనిపోవడం మళ్ళీ చుట్టు రావడంతో పెళ్లి వాయిదా పడుతూ వచ్చింది. ఇలా వీరి పెళ్లికి ఏదో ఒకటి అడ్డంకి రావడంతో ఈ ప్రేమ జంట అన్వేష్, పావనీల మధ్య గత వారం రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం వారి పాత ఇంటిలో ఎవరు లేని సమయంలో గడ్డి మంది తాగి ప్రేమ జంట ఆత్మహత్యానికి పాల్పడ్డారు. వీరిని చూసిన అబ్బాయి తల్లి బంధువులకు, ఇరు పక్కల వారికి తెలుపగా, వారిని చికిత్స నిమిత్తం వరంగల్ యంజీయం తరలించారు. కాగా మంగళవారం ఉదయం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో అన్వేష్ మృతిచెందగా, పావని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటవు

**మూడు వారాలు దాటినా జీతాలు రావట్లేదు**

**బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది పడుతున్న నరకయాతనే నిదర్శనం**

**ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరించింది లేదు**

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**తొవ్వడెస్క్ ,అక్టోబర్ 07:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటవు అనడానికి వేతనాలు అందక టీవీవీపీ, బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది పడుతున్న నరకయాతనే నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరించింది లేదు, అమలు చేసింది లేదు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతి నెలా రెండు, మూడు వారాలు దాటినా జీతాలు రాని పరిస్థితి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకైతే నెలల తరబడి జీతాలు అందని దుస్థితి. ఇక బస్తీ దవాఖాన వైద్య సిబ్బందికి అయితే ఆరు నెలలుగా వేతనాలు పెండిరగ్ పెట్టి, చుక్కలు చూపిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు మండిపడ్డారు. వైద్యులకు, ఇతర సిబ్బందికి బతుకమ్మ, దసరా పండుగ సంబురం లేకుండా చేసి, వారిని మానసిక క్షోభకు గురి చేయడం తగునా? వేతనాలు ఇవ్వాలని ఎన్నిసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం దుర్మార్గం. అత్యవసర సేవలు అందించే వైద్య సిబ్బందికే జీతాలు ఇవ్వకుంటే, ఇక ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? పథకాల్లో కోతలు.. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా వాతలు పెడుతున్నారు. మాటల్లో ఫేకుడు.. ఢల్లీకి వెళ్లి జోకుడు.. ఇదే కదా రేవంత్ రెడ్డి 22 నెలల్లో నువ్వు చేసింది. నీ పాలన వైఫల్యం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు శాపంగా మారింది. జీతాలు ఇవ్వకుండా 13 వేల మంది వైద్య సిబ్బందికి దసరా పండుగ దూరం చేశావు. కనీసం ఇప్పుడ్కైనా జీతాలు ఇచ్చి వారికి దీపావళి సంబురాన్ని అందించు అని సీఎంకు హరీశ్‌రావు సూచించారు.

# ప్రాణహిత - చెవెళ్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

**కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నం**

**ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**తొవ్వడెస్క్,అక్టోబర్ 07:**
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో ఇవాళ(మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాణహిత - చెవెళ్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉద్ఘాటించారు. తుమ్మడిహట్టి వద్ద రెండు ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశీలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణలో ఐఐటీని భాగస్వామ్యం చేస్తామని వెల్లడిరచారు. వర్షాకాలం అనంతరం రూపకల్పన చేసి ఒక సంవత్సరంలో వీటిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ - విచారణ పురోగతిపై సమీక్షించారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సమ్మక్క - సారక్క ప్రాజెక్టు, దేవదుల ప్రాజెక్టులపై సమీక్షించారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. డిరడి ప్రాజెక్టుపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్య పెంపు కోసం కొత్త విధానం సిద్ధం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఐఎస్‌డబ్ల్యూఆర్డ్, సీడీఓ బలోపేతంపై ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

# బాబాయికి మంత్రి లోకేశ్ ఘన నివాళి

**- నారా రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమం**

**- స్మృతివనం వద్ద బాబాయికి నివాళులు అర్పించిన వైనం**

**- హాజరైన నారా, నందమూరి కుటుంబ సభ్యులు**

**- పాల్గొన్న టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు**



**తొవ్వ ,ఏపీ డెస్క్ అక్టోబర్ 07:**
రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన బాబాయి, దివంగత నారా రామ్మూర్తినాయుడికి నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడి ప్రథమ వర్ధంతి సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నారావారిపల్లెలోని తమ నివాసంలో రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతికి సంబంధించి నిర్వహించిన ప్రత్యేక క్రతువులో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం, కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి గ్రామంలోని రామ్మూర్తినాయుడు స్మృతివనం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తన బాబాయిని స్మరించుకుంటూ కొంతసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై దివంగత రామ్మూర్తినాయుడికి నివాళులర్పించారు.

## మంత్రి నాపై చేసిన వ్యాఖ్యలకు స్పందించను!

**అడ్లూరి వ్యాఖ్యలపై స్పందించబోనన్న పొన్నం ప్రభాకర్**

**పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తానని స్పష్టీకరణ**

**తొవ్వడెస్క్, అక్టోబర్ 07:**



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తనను అహంకారిగా అభివర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని, ఆయనతో జరిగిన సంభాషణే ఫైనల్ అని పొన్నం తెలిపారు. రహ్మత్ నగర్ సమావేశంలో చోటుచేసుకున్న విషయాలను పీసీసీ అధ్యక్షుడికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ పరంగా మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తానని ఆయన అన్నారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల గురించి ప్రశ్నించగా అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. పొన్నం మాదిరిగా అహంకారపూరితంగా మాట్లాడటం తనకు రాదని ఆయన అన్నారు. పొన్నం తన వైఖరిని మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ పెద్దలను కలుస్తానని కూడా ఆయన తెలిపారు. పొన్నంపై అడ్లూరి లక్ష్మణ్ బహిరంగంగా విమర్శలు చేయడంతో పీసీసీ చీఫ్ స్పందించారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఫోన్ చేసి ఇరువురు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అడ్లూరి లక్ష్మణ్ తనపై చేసిన వ్యాఖ్యల మీద స్పందించేందుకు పొన్నం ప్రభాకర్ నిరాకరించారు.

## పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు**

**అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం**



**తొవ్వడెస్క్,అక్టోబర్ 07:**
తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు దాఖల్కెంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సహచర మంత్రి అన్న విజ్ఞత లేకుండా, ప్రజల్లో ఉన్నామనే ఆలోచన లేకుండా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లక్ష్మణ్‌ను దూషించడం సరికాదని, దీనిని తాము ఖండిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తక్షణమో సుమోటోగా స్వీకరించి అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు కమిషన్ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శిల దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

# బెంగళూరును వదిలి సొంత ఊరికి..



కాస్త డబ్బు, పేరు ప్రఖ్యాతులు రాగానే చాలా మంది సొంత ఊళ్లను వదిలి నగర జీవితంవైపే మొగ్గుచూపుతుంటారు. ఇక వీరిలో సినిమా సెలబ్రిటీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నేటి రోజుల్లో సొంత ఊరిలో నివాసం ఉండే సినీతారలు ఎక్కడా కనిపించరు. కానీ 'కాంతార' ఫేమ్ రిషబ్‌శెట్టి అందరిలో చాలా ప్రత్యేకం. దక్షిణ కన్నడ సంస్కృతి, సంప్రదాయాలపై అపారవిశ్వాసం కనబరిచే ఆయన గత నాలుగేళ్లుగా సొంత ఊరు కుందాపురలోనే నివాసం ఉంటున్నారట. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో నటించిన 'కాంతార చాప్టర్-1' ఇటీవలే విడుదలై దేశవ్యాప్తంగా భారీ వసూళ్లను సాధిస్తున్నది. మూడు రోజుల్లోనే ఈ చిత్రం 300కోట్ల మైలురాయిని దాటింది. ఈ విజయానందాన్ని ఆయన తన సొంత ఊరి ప్రజల మధ్యన ఆస్వాదిస్తున్నారు. 'గత నాలుగేళ్లుగా రిషబ్‌శెట్టి కుందాపురలోనే (కర్ణాటక ఉడిపి జిల్లా) ఉంటున్నారు. 'కాంతార చాప్టర్-1' తాలూకు అధిగ భాగం షూటింగ్‌ను కూడా తన ఊరి పరిసర ప్రాంతాల్లోనే జరిపాడు. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల కోసం తన టీమ్ మొత్తాన్ని కుందాపురకు రప్పించాడు' అని ఆయన సన్నిహితులు చెప్పారు. ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కూడా రిషబ్‌శెట్టి తన సొంత ఊరిపై ఉన్న ప్రేమను బయటపెట్టారు. ఎంత ఎదిగినా తన సంస్కృతి మూలాలను మరచిపోనని, తన పిల్లలు ప్రస్తుతం ఇక్కడే చదువుకుంటున్నారని, భవిష్యత్తులో చదువు విషయంలో వారి ఇష్టప్రకారం నిర్ణయాలు తీసుకుంటారని, తాను మాత్రం మరికొన్నేళ్లు కుందాపురలోనే ఉండాలనుకుంటున్నానని అన్నారు రిషబ్‌శెట్టి. 'కాంతార చాప్టర్ 1' చిత్రం లాంగ్‌రన్‌లో 700కోట్ల మైలురాయిని చేరుకోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## చుక్కలు తెమ్మన్నా.. తెంచుకురానా..

'మహానటి' తర్వాత ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై మరో లేడీ ఓరియెంటెడ్ డ్రామా తెరకెక్కనున్నది. ఈ సినిమాకు 'చుక్కలు తెమ్మన్నా.. తెంచుకురానా..' అనే టైటిల్‌ను ఖరారు చేశారట. శ్రీలీల ఇందులో మెయిన్ లీడ్ చేయనున్నారని సమాచారం. ఓ కొత్త డైరెక్టర్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇది అద్భుతమైన కథ అని తెలుస్తున్నది. కథానాయికగా శ్రీలీల పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ ఈ కథకు ఎవరు కథానాయికగా నటించినా కచ్చితంగా మంచి పేరు వస్తుందని సన్నిహిత వర్గాలు చెబుతున్నది. ప్రస్తుతం మోహిత్ సూరి దర్శకత్వంలో బాలీవుడ్ సినిమా చేస్తూ బిజీగా ఉన్న శ్రీలీలకు టాలీవుడ్‌లో ఇది నిజంగా బంపర్ ఆఫరే అనాలి. ఈ విషయంపై అధికారిక ప్రకటన మాత్రం రావాల్సివుంది.





# టిక్కల్ టిక్కల్.. ధమాల్ ధమాల్..

యువహీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా రూపొందిన ఎంటైర్టైన్మెంట్ డ్రామా 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. జైన్స్ నాని దర్శకుడు. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మాతలు. ఈ నెల 18న దీపావళి కానుకగా సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఈ సినిమా నుంచి మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు.'టిక్కల్ టిక్కల్.. ధమాల్ ధమాల్.. కలిసి వచ్చే కాలం ముందు నువ్వు సూపర్‌రా.. టైమ్ కాస్త బ్యాడ్ అయితే.. కె ర్యాంప్‌రా..' అంటూ సాగే ఈ పాటను సురేంద్ర కృష్ణ రాయగా, చేతన్ భరద్వాజ్ స్వరపరిచారు. సాయిచరణ్ భాస్కరుని ఆలపించారు. ప్రేమ, ప్రేమికురాలి మధ్య హీరో ఎలా నలిగిపోయాడో ఈ పాట తెలియజేస్తున్నది. నరేశ్, సాయికుమార్, వెన్నెల కిశోర్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సతీష్‌రెడ్డి మాసం, నిర్మాణం: హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్.



## కవిత్వంపై ఇష్టంతో సినిమా వైపు..

'నేను వంద చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైన్ చేశాను. 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నా. అందుకే అసిస్టెంట్ డైరెక్టర్‌గా అనుభవం లేకున్నా సినిమా తీయగలననే నమ్మకం ఏర్పడింది' అని చెప్పింది ప్రముఖ ట్కాస్టైలిస్ట్ నీరజ కోన. 'తెలుసు కదా' చిత్రంతో ఆమె దర్శకురాలిగా పరిచయమవుతున్నది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం డైరెక్టర్ నీరజ కోన పాత్రికేయులతో ముచ్చటించింది. తనకు పాఠశాల రోజుల నుంచే సాహిత్యం, రచన అంటే ఇష్టమని, తాను రాసిన కవితలతో ఓ పుస్తకం కూడా పబ్లిష్ అయిందని చెప్పింది. ఆమె మాట్లాడుతూ ' ఇండస్ట్రీలో నాని వంటి ఫ్రెండ్స్ నన్ను బాగా ఎంకరేజ్ చేశారు. దాంతో సినిమాకు కథ రాయగలననే నమ్మకం కలిగింది. ఓ సినిమా ఈవెంట్‌లో హీరో నితిన్‌కు ఈ కథ తాలూకు లైన్ చెప్పాను. దీనికి సిద్ధు అయితే బాగుంటుందని అన్నారు. ఆ తర్వాత సిద్ధుకి కథ చెబితే సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. అలా ఈ సినిమా పట్టాలెక్కింది' అని చెప్పింది. 'తెలుసు కదా' చక్కటి ప్రేమకథా చిత్రమని, మూడు పాత్రల చుట్టూ కథ నడుస్తుందని, ప్రతీ పాత్ర నిజాయితీగా ఉంటుంది కాబట్టి.. ప్రేక్షకులు కథతో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారని తెలిపింది.'సిద్ధు ఈ కథని మరోస్థాయికి తీసుకెళ్లారు. వరుణ్ అనే యువకుడి పాత్రలో మెస్మరైజ్ చేశారు. తమన్ మ్యూజిక్, పీపుల్ మీడియా నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. త్వరలో ఓ హార్ట్ హిట్టింగ్ లవ్‌స్టోరీ చేయబోతున్నా. ఆ సినిమా వివరాల్ని త్వరలో ప్రకటిస్తాం' అని నీరజా కోన చెప్పింది.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా సోమారం నివాసికి డాక్టరేట్ ప్రదానం

/తొర్రూరు



'చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న, నా చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చుట' అన్నాడు భాస్కర శతకకర్త. భాస్కరుడు చెప్పిన మాటలను తు.చ. తప్పకుండా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సోమవారం గ్రామ నివాసి గద్దల అనిల్ ఎస్సీ మాదిగ కడుపేద నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగి, ఎన్ని సమస్యలు ఎదురైనా చదువును విడిచిపెట్టకుండా డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి చేతుల మీదుగా పీహెచ్డీ తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు గద్దల అనిల్. సోమారం గ్రామం, లో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు తొర్రూరులో, 5, 6 తరగతులు శారద హైస్కూల్లో, 10వ తరగతి కొండాపూర్‌లో పూర్తి చేశాడు. ఆ తరువాత ఇంటర్మీడియట్ సిఇసి(%జ.జు.జ%) విద్యను ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ జేసీ %ూూాూాఔ=జీజ% నర్సంపేటలో పూర్తి చేసుకొని- డిగ్రీ బి ఏ హెచ్ టి పి( %దీూా. ఎ.ూ%) విద్యను నిజాం కళాశాలలోను, ఎం.ఏ. తెలుగు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, టి.పి.టి. విద్యను నంద్యాల, ఎం.ఫిల్. విద్యను మద్రాసు విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. 'సరబాదముఖ్యప్రాణ్ రావు రచనలు - సమగ్ర పరిశీలన' పేరుతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డా. రజనీ గారి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథం సమర్పించి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. అంతటితో ఆగకుండా తాను చదివిన చదువు నలుగురికి ఉపయోగపడేలా నిజామాబాదులో ఉన్న రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నౌలెడ్జి టెక్నాలజీస్ (%=+ఖఖు దీూాూా=%)లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా సోమారం గ్రామ ప్రజలు తల్లిదండ్రులు, బంధుమిత్రులు, ఫ్రెండ్స్ గ్రామస్తులు ఆనందం వ్యక్తం శుభాకాంక్షలు తెలియ చేశారు.

## ఆదివాసీల ముద్దు బిడ్డ కొమరం భీమ్ కి ఘన నివాళులు

### మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

**తొవ్వ,గార్ల అక్టోబర్ 07:**



గార్ల మండల పరిధిలోని ముల్కనూరు గ్రామంలో జల్ జంగిల్ జమీన్ అని నినినాదించి,ఆదివాసీల హక్కులకై అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ గిరిజన నాయకుడు ఆదివాసిల ముద్దుబిడ్డ శ్రీ కొమరం భీమ్ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసన సభ్యురాలు బానోతు హరిప్రియ నాయక్ ఘన నివాళులు అర్పించారు.అనంతరం పూల మాల వేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి పానుగంటి రాధ గార్ల మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ముల్కనూరు గ్రామ శాఖ అధ్యక్షులు పుల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేపూరి నరేష్ యాదవ్ ముల్కనూరు ఎంపీటీసీ పరిధి ఇన్చార్జ్, మాజీ సర్పంచ్ సయ్యద్ సలీం, సోషల్ మీడియా అనిల్ కుమార్ యాదవ్, చిలక లక్ష్మీనారాయణ, రాకూరి ఉప్పలయ్య,ఐతనబోయిన వెంకటేష్, ఐతనబోయిన ఉమేష్, కొత్తపల్లి కిరణ్, కుసుమూరు జార్జ్, బీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించండి,

**పజలకు అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోండి,**

**సిజెఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి,**

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి,**

**తొవ్వ న్యూస్ ప్రతినిధి కురవి అక్టోబర్ 7,**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టౌన్ ప్రధాన కార్యదర్శి తురక రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. పేద బడుగు బలహీన వర్గాలు కోసం పోరాడుతూ వారికి ఇంటి స్థలం, గూడు కల్పించేందుకు కమ్యూనిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని అలాంటి వారిని స్థానిక సంస్థల్లో గెలిపించుకుంటే ఇంకా మెరుగైన ఫలితాలు ప్రజలకు చేరుతాయని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ బిజెపి పార్టీలకు వ్యతిరేకంగా కలిసివచ్చే పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు సిజెఐ గవాయి పై న్యాయవాది దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఆయన అన్నారు. అలాంటివారిని న్యాయవాది వృత్తి నుంచి బహిష్కరించాలని( డిస్మిస్ )చేయాలని సిఐపిఐ పార్టీ కోరుతుందని, డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, దొంతు రామ్మూర్తి, బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, రామగోని రవి, కలగూర నాగరాజు, బొల్లం ఉప్పలయ్య, నిలుగొండ నాగేశ్వర రావు, బొల్లు వెంకన్న, రేపకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





## నిరుద్యోగులపై ఎందుకంత కక్ష సాధిస్తున్నారు

గ్రూప్ - 1 నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు తప్పనిసరిగా అమలు చేయాలి..

పరీక్షలు మళ్ళీ నిర్వహించాలి ..

జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత



**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 08:**

నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధిస్తుందని నీళ్లు నిధులు ,నియామకాల్లో మల్లి పాతరోజులు గుర్తుకు తెస్తున్నారని ఓ పక్క దేశ అత్యున్నత న్యాయస్థానం గ్రూప్ 1 నియామకాలు చేయవద్దని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత అన్నారు . మంగళవారం మీడియా ద్వారా స్పందిస్తూ గ్రూప్ - 1 నియామకాలను వెంటనే రద్దుచేయాలని తెలంగాణ ప్రభుత్వంతీసుకున్న అనాలోచిత చర్యలు వల్ల నిరుద్యోగ యువత భవిత ప్రశ్నార్ధకంగా మారిందన్నారు గ్రూప్ - 1 నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు తప్పనిసరిగా అమలు చేయాలని ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినా... వారికి ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించింది అంటే ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులను చేసిందో సుప్రీం కోర్టు ఎత్తి చూపినట్టేకదా అని ప్రశ్నించారు , గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల వివాదం న్యాయ స్థానాల్లో తేలేవరకు అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దని తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ -1 నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన వరకు అనేక తప్పులు చేసిందన్నారు'.. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను తుంగలో తొక్కిందని న్యాయస్థానాలు తుది తీర్పు ఇచ్చేలోపు ప్రభుత్వం అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను డిస్పోజ్ చేస్తే నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను స్తంభింప చేస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు .

# సుప్రీం కోర్ట్ సీజేఐ గవాయి పై దాడిని ఖండిస్తూ ఆరుట్ల గ్రామంలో అన్ని పార్టీల ఆధ్వర్యంలో అంబేద్కర్ పాలాభిషేకం


**తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 7:**





సుప్రీ కోర్టు చీఫ్ జస్టిస్ పై గవాయ్ పై దాడిని ఖండిస్తూ ఆరుట్ల గ్రామంలో అన్ని పార్టీల ఆధ్వర్యంలో అంబేద్కర్ కి పాలాభిషేకం...గవాయ్ పై దాడి అప్రజాస్వామికం భారతదేశంలో మాట్లాడే హక్కు ప్రశ్నించే హక్కు భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు సుప్రీంకోర్టులో జెడ్జి ఒక దళితుడు అయినందున జీర్ణించుకొని మనువాదులు సీజేఐ పై దాడిచేసినారు. దీనిని 140 కోట్ల మంది భారత ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, మేధావులు ప్రతిఒక్కరు ఖండిచల్సిన అవసరం ఉంది. ఇలాంటి దాడులు పునరవృతం కాకుండా రాకేష్కిషోర్ని కఠినంగా శిక్షించి బార్ కౌన్సిల్ నుంచి అతన్ని పర్మినెంట్ గా తొలగించాలి. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గా కంబాలపల్లి భాస్కర్ ప్రజాసంఘాల అధ్యక్ష్యులు, అడ్వకేట్ మంకు మురళి, ఎక్స్ ఎంపిటిసి చీరాల రమేష్, ఎక్స్ కో ఆప్షన్ సభ్యులు యూసఫ్అలీ, సలాం గార్లు, అనంగల్ల పరమేష్, ప్రజాగళం దామెర భూపాల్, పున్నం రాము, సిపిఎం నాయకులు బడ్డు విజయ్, డిఎస్పీ నాయకలు కొండిగారి శ్రవణ్, చీమర్ల మహేష్, పంది శేఖర్, జోగు వినోదకుమార్, చీమర్ల శివలింగం, రంజిత్ చీమర్ల నర్సింహా, ,చిందాం శ్రీశైలం, నూకం రాజు, వేదిరే రమణరెడ్డి, మంకు సురేష్, సాతిరి వెంకటేష్, దామెర శివ, మంకు వినోద్, %ఎస% రఫీక్, కొత్తపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.








# ఎన్నికల సమరం









## జూబ్లీ హస్తవాసి ఎవరికో



### కాంగ్రెస్ అధిష్టానం కు పంపిన ముగ్గురు పేర్లు

#### బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్, సి ఎన్ రెడ్డి

**తొవ్వ ,హైదరాబాద్ , అక్టోబర్ 07:**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు పోరు రసవత్తరంగా మారింది. ఇప్పుడు అందరి ఫోకస్ జూబ్లీహిల్స్‌పైనే పడింది. ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించి బీఆర్ఎస్ ప్రచారం కూడా మొదలు పెట్టింది. కానీ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ.. అభ్యర్థులను ఎంపిక చేయలేదు. అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముగ్గురి పేర్లను ను అధిష్టానం కి సిఫారస్ చేసింది ముందుగా పార్టీ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు జూమ్ సమావేశం నిర్వహించి అభ్యర్థి విషయంలోకొలిక్కి వచ్చినట్టు తెలుస్తుంది అయితే అన్యుహంగా పంపిన జాబితాలోని మాజీ మేయర్ రామ్ మోహన్ ఎన్నికల బరిలో లేనట్టుగా ప్రకటించడం దానికి కారణం రామ్ మోహన్ కి టికెట్ ఇస్తే పతంగి పార్టీ ఎంఐఎం మద్దతు ఇవ్వనని చెప్పడం కారణంగా కనిపిస్తుంది అయితే రామ్ మోహన్ పేరును తెరమీదకు తెచ్చి కాంగ్రెస్ నేత శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ కు లైన్ క్లియర్ చేయడానికి చేస్తున్న పన్నాగమా అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు ఇక ఇదే కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి అభ్యర్థి పేరు బలంగా వినిపిస్తుంది ఆఖరినిమిషంలో అయనపేరును కూడా ఫైనల్ చేసే ఆస్కారం లేకపోలేదు ,. అన్ని సమీకరణాలు కుదిరాకే కాంగ్రెస్ అభ్యర్థిని ఫైనల్ చేస్తునట్టు తెలుస్తోంది. అయితే టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది.ఏదిఏమైనా నేడు అభ్యర్థి విషయం తేటతెల్లం అవుతుందని కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రచారం లో మునిగిపోవాలని ఎలాగైనా జూబ్లీ హిల్స్ కారు సీటును కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలు ఉవ్విళూ ఊరుతున్నారు ఏమావునో ఓటరుకే ఎరుక

### స్థానిక ఎన్నికలు పక్కా.. అయితే ప్లాన్ A, లేదంటే B..!




తొవ్వ ప్రతినిధి
ఏదేమైనా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బిసిలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టులో రేపు విచారణ జరగనుండగా న్యాయ నిపుణులు, మంత్రులు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తమ నిర్ణయ ఉద్దేశం, గత తీర్పులను కోర్టుకు వివరించాలని లాయర్లకు సూచించారు. జిఓను తోసిపుచ్చితే ఆదేశాలు పాటిస్తామని హైకోర్టుకు విన్నవించాలన్నారు. ఇలా అయితే పార్టీపరంగా 42% రిజర్వేషన్లతో (Plan:B) ఎన్నికలకు వెల్దామని తెలిపారు.

### సింగరేణి లో ఎన్నికల పండుగ




**తొవ్వ ,ప్రతినిధి ,అక్టోబర్ 07:**
తెలంగాణలో స్థానిక సమరానికి నగారా మోగిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయగాహైకోర్టు లో వున్నపిల్ కారణంగా నేడు తీర్పు రానున్నదున .. అక్టోబర్ 9 నుంచి నామినేషన్ల పక్రియ మ్నొదలు కానుంది. రెండు విడుతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు.. మరో మూడు విడుతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే సింగరేణి ఉద్యోగులకు మార్గం సుగమమైంది. దాదాపు 15 ఏళ్లుగా యాజమాన్యం విధించిన ఆంక్షలు, అభ్యంతరాల కారణంగా ఎన్నికలకు దూరంగా ఉన్న ఉద్యోగులు.. తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌తో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం సింగరేణి ఉద్యోగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చని స్పష్టం చేయడంతో ఈ ప్రతిష్టంభన తొలగిందిఇక కార్మికులు వారి కుటుంబ సభ్యులు పోటీకి సిద్ధమవుతున్నారు





# "స్థానికం"లో స్థానికేతరులను"కుర్చీ" ఎక్కనివ్వం!

పార్టీల గద్దెలు కట్టేది మేం.. గద్దెనెక్కేది పైసలు ఉన్నోళ్లేనా?

త్యాగాలు మావి... భోగాలు స్థానికేతరులుకా?

పార్టీ కోసం శ్రమించిన వారికా! పైసలు ఉన్నోళ్లకా తేల్చుకుంటాం!

ఆయా పార్టీల నేతల మనోగతం




**తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 07** రాజకీయ పార్టీల కార్యకర్తలుగా నాయకులుగాపార్టీల గెలుపు కోసం జెండాలు కట్టాం. జేజేలు కొట్టాం, ప్రచారంలో అన్ని తామై ముందు నడిచాం, కన్న తల్లిదండ్రులను. తోడబుట్టిన సోదరులను పార్టీల కోసం వదులుకున్నాం. ఇలా భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అన్ని ఓర్చుకున్నాం. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసాం , ప్రాణాలకు సైతం వెనకాడకుండా ప్రాణాలర్పించాం అనగారిన వర్గాల అభ్యున్నతి జరుగుతుందని, నీళ్లు నియామకాలు నిధులె కాకుండా చట్టసభల్లో స్థానిక సంస్థల్లో పదవులు అందుతాయని ఆశపడ్డాం. కానీ నాటి బ్రిటిష్ పాలకులు విభజించు పాలించు అనే సూక్తినే మన పాలకులు ఆచరించారనడంలో సందేహించాల్సిన అవసరం లేదు. ఈ క్రమంలోనే నాటి నుంచి నేటి వరకు నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ ఆది నాయకత్వానికి డబ్బుల సంచులు అందిస్తున్న నేతలకే పదవులు కట్టబెడుతున్నారని, ప్రజా సంక్షేమం కోసం, సంక్షేమ పథకాల అమలులో తమదైన పాత్రను పోషిస్తూ గ్రామాల్లో అన్ని తామై భరిస్తూ, నిస్వార్థంగా తమ జీవితాలను త్యాగం చేస్తూ ఏళ్లుగా శ్రమిస్తున్న వారికి పదవులు అందని ద్రాక్ష గానే మారుతున్నాయని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్న తీరు ప్రస్ఫుటమవుతుంది. కాగా మండలంలో గత రెండు పర్యాయాలుగా జెడ్పీటిసి స్థానాలను ఏళ్లుగా కష్టపడిన నేతలకు ఇవ్వకుండా కేవలం అధిష్టానానికి డబ్బులు అందించిన నేతలకి ఇచ్చి ఆరుగాలం శ్రమించిన నేతలను అణగదొక్కారనడం లో సందేహం లేదు. ప్రస్తుతం జరగబోవు స్థానిక సమరంలో పార్టీలు ఏవైనా ప్రజలకు అందుబాటులో ఉన్న నేతలకు అవకాశాలు ఇవ్వాలని లేనట్లయితే పార్టీల కోసం శ్రమించిన స్థానిక నేతలకు, వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెంది వచ్చిన నేతలకు మధ్య పోటీ జరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే టీఆర్ఎస్ ఉద్యమ నేతలు బాహటంగానే విలేకరుల సమావేశం నిర్వహించి అధిష్టానానికి అల్టిమేటం పంపించారు. ఇక అధికార పార్టీ నేతలు సైతం ముఖ్య కూడలిలో బాహటంగానే చర్చిస్తున్నారు. వీరికి వామపక్ష పార్టీల నేతలతో పాటు జాతీయ పార్టీ బిజెపి సైతం మద్దతు ప్రకటిస్తున్నారని సూచనప్రాయంగా తెలుస్తోంది. ఇది కాస్త ఎన్నికల సంగ్రామం లో బలపడితే పెట్టుబడిదారులకు. పార్టీలకు శ్రమించిన నేతలకు మధ్య పోరు ఉధృతంగా ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ , మరో జాతీయ పార్టీ బిజెపి, వాము పక్ష పార్టీలు సైతం స్థానికులు, నిజాయితీగా శ్రమించిన నేతలకు టిక్కెట్లు కేటాయించి బరిలో నిలిపితే నే పార్టీల పరువు నిలబడుతుందని. నిజమైన నేతలు ఎన్నుకోబడతారని మేధావులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అభిప్రాయం మేరకు చేస్తారా? ఇలాగే వలసవాదులను నిలుపుతారా వేచి చూడాల్సిందే?

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




తొవ్వ ,తోఱురు అక్టోబర్ 08:

పాలకుర్తి మండల కేంద్రంలో తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి అధ్యక్షత వహించాగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువనాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమైనవి. ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేయాలని . ప్రజల్లోకి వెళ్లి పార్టీ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలన్నారు , . ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయంఅని . గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, పేదల సంక్షేమం %–% ఇవే కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతలు. ఈ ప్రభుత్వ అభివృద్ధి తీరును ప్రజలకు తెలియజేసి, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడమే మనందరి లక్ష్యం అన్నారు .మండల స్థాయి నాయకులతో ఎన్నికల వ్యూహాలపై చర్చించి, బూత్ స్థాయిలో పార్టీ బలపరచడం, ఓటర్ సంప్రదింపు కార్యక్రమాలు, ప్రచార పద్ధతులపై మార్గదర్శకాలు అందించారు..సమావేశంలో తొర్రూరు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువనాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సిజెఐ పై దాడికి యత్నం న్యాయవ్యవస్థ రాజ్యాంగం పై దాడి ....

## నిమ్న వర్గాలపై సనాతన ధర్మం పేరుతో జరుపుతున్న దాడులు ఖండించాలి

### గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోత్ కిషన్



**తొవ్వ ,ప్రతినిధి అక్టోబర్ 09:**
భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గావాయి మీద సుప్రీం కోర్టు ఆవరణలో బూటుతో దాడి చేయడం అమానుష చర్య.అని నిమ్న వర్గాలపై సనాతన ధర్మం పేరుతో జరుపుతున్న దాడులు ఖండించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోత్ కిషన్ అన్నారు , మంగళవారం అయన పత్రిక ప్రకటన విడుదల చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన ఘటన కాదని ఇది రాజ్యాంగం మీద న్యాయ వ్యవస్థ మీద ప్రజాస్వామ్యం పై జరిగిన దాడిగా భావిస్తున్నాం అన్నారు భారతదేశానికి దిశా దశ న్యాయవ్యవస్థ అందించే చీఫ్ జస్టిస్ మీద దాడి జరిగిందని సామాన్య మధ్యతరగతి వర్గాల కు పీడిత శ్రామిక వర్గాలకు న్యాయం ఎక్కడ జరుగుతుందన్నారు బేషరతుగా దాడిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి కోర్టు నుండి బహిష్కరించాలని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలో హక్కులను సక్రమంగా అమలు చేయక రాజ్యాంగం కాలరాస్తూ సనాతన ధర్మాన్ని ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాయడం శోచనీయం ప్రజాస్వామ్యము రక్షించుకొనుటకు రాజ్యాంగంలో హక్కులు చట్టములను అమలు కోసం పోరాటం చేయాలని ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఈ అంశాన్ని ఖండించాలన్నారు

# పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరికలు



**తొవ్వ ,పాలకుర్తి , అక్టోబర్ 07:**
పాలకుర్తి మండల కేంద్రంలో వివిధ పార్టీ ల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్దఎత్తున చేరికలు జరిగాయి దేవరుప్పుల మండలంలోని లక్ష్మణ్ తాండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోతు సుజాత, బానోత్ శోభ, భీమిలి, బికోజి, అలాగే రాయపర్తి మండలం మహబూబ్నగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిరామనేని అశోక్, బొమ్మిడినేని రమేష్, శ్రీకాంత్, శ్రీలత, రజిని, శ్యామల, తదితరులు బీఆర్ఎస్%–%పార్టీలకు రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు..ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీకి ఆహ్వానించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ం ప్రజల ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత %–% ఇవే మా ప్రధాన లక్ష్యాలు. ఈ నమ్మకం కారణంగానే ప్రజలు ఇతర పార్టీలను విడిచి కాంగ్రెస్ వైపు వస్తున్నారు, అని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి పనిచేయాలి. ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచి, కాంగ్రెస్ పతాకాన్ని ఎగురవేయాలి. ప్రజల సేవే మా రాజకీయ ధ్యేయం, అని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు..కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ం ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల పట్ల చూపుతున్న సేవాభావం మాకు ఎంతో నచ్చాయి. ప్రజల పక్షాన నిజాయితీగా పని చేసే నాయకత్వం కావాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నాం, అని తెలిపారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువకార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



